క్లుప్తంగా

కార్పొరేట్ సెలూన్‌ను రద్దు చేయాలి

ఉట్నూర్‌రూరల్: తరతరాల నుంచి నాయీబ్రాహ్మణులు కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్నారని కార్పొరేట్ సెలూన్‌ను రద్దు చేయాలని సంఘం డివిజన్ అధ్యక్షుడు ఘర్షకుర్తి వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కులవృత్తులను ప్రోత్సహిస్తూ పథకాలను ప్రవేశపెట్టి సకాలంలో అందేవిధంగా ప్రభుత్వం చూడాలని కోరారు.

అన్నదానం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ, పరిసర ప్రాంతాల పేద ప్రజల ఆకలిని తీర్చేందుకు సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు, న్యాయవాది సంగెం సుధీర్ కుమార్, సభ్యులు సలీమ్, సుభాష్, శేఖర్, అడెల్లు, లఖన్, సుధీర్ పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందిన బాలిక అంత్యక్రియలను మానవ సేవే మాధవ సేవ, యువజన సంఘాల నాయకులు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా బుస్సాపూర్ గ్రామానికి చెందిన పోసాని– ప్రశాంత్ దంపతులు యాచకులుగా జీవనం సాగిస్తూ.. ఆదిలాబాద్ పట్టణంలో ఉంటున్నారు. ఇటీవల వారి కూతురు సారక్క అగ్ని ప్రమాదానికి గురైంది. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లగా డబ్బులు లేక తిరిగి అక్కడి నుంచి రిమ్స్‌కు తీసుకువచ్చారు. శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో మానవ సేవే మాధవ సేవ సమితి సభ్యులు సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు జరిపారు. కార్యక్రమంలో శశికళ, బాలశంకర్ కృష్ణ, దేవిదాస్, పస్పుల రాజు, దొంతుల ప్రవీణ్, అర్బాత్ ఖాన్, రాహుల్, నారాయణ, ప్రమోద్, నిఖిల్, గణేశ్ పాల్గొన్నారు.

మాధవ్‌రావు సంతాప సభ



మాట్లాడుతున్న మర్సుకోల తిరుపతి

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ, ప్రజా ఉద్యమకారుడు కుడ్మెత మాధవ్ మృతి ఆదివాసీ సమాజానికి తీరని లోటని లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి అన్నారు. ఆదివారం మండలంలోని లక్కారం రాంజీగోండ్ భవన్‌లో మాధవ్‌రావు సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు భుజంగ్‌రావు, సుగుణ, తిరుపతి పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల ఆశ్రమం ప్రారంభం



ప్రారంభిస్తున్న దుర్గం శేఖర్

గుడిహత్నూర్: మండలంలోని చింతగూడలో మానసిక దివ్యాంగుల ఆశ్రమాన్ని ఆదివారం దుర్గంట్రస్టు చైర్మన్ దుర్గం శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల వ్యక్తుల కోసం ఆశ్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆశ్రమ నిర్వాహకులు పిప్పల సుధారక్ విద్యారాణి దంపతులను అభినందించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మాజీ ఎంపీపీ గంగారెడ్డి, చిలుకూరి జ్యోతి రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, సునీల్, ధోని జ్యోతి, బాబాశ్యాం, ప్రశాంత్, గణేశ్, అంజాద్, ఖలీ, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు

ఖానాపూర్: మరో అడెల్లిగా పేరు గాంచిన మండలంలోని సింగాపూర్ పెద్దమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఏటా వానాకాలం పంటల సాగుకు ముందు రైతులు ఈ ఆలయానికి వచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. వర్షాకాలం తొలకరి ప్రారంభం కావడంతో ఆదివారం భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు లింగన్న ఆధ్వర్యంలో పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఖానాపూర్: ఖానాపూర్ మహాలక్ష్మి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ అభివృద్ధికి రిటైర్డ్ టీచర్ పాలెపు ప్రసూన–సుదర్శన్ దంపతులు రూ.50వేల విరాళాన్ని ఆదివారం అందజేశారు. అలాగే శ్రీరాంనగర్ కాలనీకి చెందిన గడ్‌దాస్ లావణ్య–చరణ్ దంపతులు రూ.5వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎలిశెట్టి లింగేశ్వర్, డబ్బా శ్రీనివాస్, మాదాసు రాజేశ్వర్, పంబాల భీమేశ్వర్, భీంరావు, గాడ్పు చందు, జోగు రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

రండి.. సర్కారు బడిలో చేరండి

- ప్రైవేట్‌కు దీటుగా వసతులు
- నాణ్యమైన బోధనతో పాటు మధ్యాహ్న భోజనం
- విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం
- ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం
- కొనసాగుతున్న 'బడి బాట'

జిల్లాలో..
ప్రభుత్వ పాఠశాలలు : 678
విద్యార్థుల సంఖ్య: 1,27,354



బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రచార ప్రతులను విద్యార్థులకు అందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

బోథ్: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రస్తుత తరుణంలో సర్కారు బడులను పటిష్ట పరిచేందుకు విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల్లో వసతులు మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల ప్రవేశాలపై దృష్టి సారించింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 17వరకు కొనసాగనుంది. బడీడు, బడి బయటి పిల్లలను బడిలో చేర్పడమే ఈ కార్యక్రమం లక్ష్యం కాగా ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం చేపడుతున్నారు. రోజూ ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు తల్లిదండ్రులను కలుస్తున్నారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన తీరుపై వారికి వివరిస్తున్నారు. విద్యార్థులు ప్రైవేట్ బాట పట్టకుండా అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి.

విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంపే లక్ష్యంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా బడి బాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అలాగే ఐదేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీల నుంచి ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ వివరాలను గ్రామ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువు పూర్తి చేసుకున్న వారు ఉన్నత పాఠశాలలకు వెళ్లేలా చూస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరును వివరిస్తున్నారు. అలాగే సర్కారు బడిలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని తెలియజేస్తున్నారు.

రోజూ నివేదిక

బడి బాట కార్యక్రమానికి సంబంధించి ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సమాచారంను రోజు వారీగా నమోదు చేస్తున్నారు. కొత్తగా చేరిన వారు అంగన్‌వాడీల నుంచి వచ్చారా? లేక ప్రైవేట్ పాఠశాల నుంచి వచ్చారా? అన్న విషయాలను ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు బడి బాట పోర్టల్‌లో అప్లోడ్ చేస్తున్నారు. వీటిని డీఈవో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారుకు నివేదిస్తున్నారు.

ప్రైవేట్‌కు వెళ్లకుండా చర్యలు

జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో పాటు, నాణ్యమైన విద్య అందించడంపై దృష్టి పెట్టాం. ఈ ఏడాది నుంచి విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. అలాగు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ బుక్కులు కూడా ఉచితంగా ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ విషయంలో తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలి.

– ప్రణీత, డీఈవో

'మాదిగలకు దళితబంధు ఇవ్వాలి'



మాట్లాడుతున్న సునీల్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: రెండో విడత దళితబంధు పథకంలో 65 శాతం మాదిగలకు దళితబంధు ఇవ్వాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. మాదిగ కులస్తుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూడడం సరికాదన్నారు. దళితబంధును కేవలం పార్టీ కార్యకర్తలకే అందిస్తున్నారని ఆరోపించారు. వెంటనే మాదిగలకు దళితబంధు ఇవ్వాలని లేదంటే ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సభ్యులు రాజేశ్వర్, నదికుంటి పెంటన్న, బట్టు మహేందర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: దళితబంధు పథకం లబ్ధిదారుల ఎంపికలో మాలలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మాల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న, బాబన్నలు మాట్లాడుతూ.. రెండో విడత దళితబంధు ఎంపికలో అర్హులైన మాల కులస్తులకు న్యాయం చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న మాల సంక్షేమ భవనానికి రూ.30 లక్షల నిధుల కేటాయింపుతో పాటు అర్హులైన మాలలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వరప్రసాద్, కిరణ్, క్రాంతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వస్తువులు అందించాలి

ఆదిలాబాద్‌టౌన్: వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందించాలని కన్జుమర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మోహన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కల్తీ వస్తువులను గుర్తించేందుకు ప్రభుత్వం అందించే కిట్లను సభ్యులకు అందజేశారు. అధికారులు తనిఖీ చేసి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో సతీశ్, సత్యనారాయణ, రాజు, తులసి, ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఉట్నూర్ ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ జైవంత్‌రావు తెలిపారు. సమావేశానికి ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం

ఇచ్చోడ: అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండలంలోని మాదపూర్‌లో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ప్రతీ గ్రామంలో అంగన్‌వాడీ భవనాలు మంజూరు చేసి నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఖమర్ సుల్తాన, మోహరాజ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు సముచిత స్థానం



నియామక పత్రం అందజేస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: పార్టీ బలోపేతానికి కృషి చేసే కార్యకర్తలకు బీజేపీలో సముచిత స్థానం దక్కుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలకు వివిధ పదవుల్లో నియమించారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. నాయకులు నగేశ్, లాలా మున్న ఉష్కం రఘుపతి, ముకుంద్, చిలుకూరి జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

బేలలో బీసీ గురుకులం

- తరగతుల నిర్వహణకు సిద్ధమవుతున్న భవనం
- దాదాపు పూర్తయిన పనులు



నిర్మిస్తున్న నూతన గురుకుల భవనం

బేల: ఏళ్ల క్రితం మండలానికి ఇంగ్లీషు మీడియం మోడల్‌స్కూల్ మంజూరైనప్పటికీ.. అప్పటి పాలకులు నిర్లక్ష్యంతో ప్రభుత్వ స్థలం కేటాయించ లేదు. దీంతో మండలానికి మోడల్ స్కూల్ దక్కలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదటి దఫాలో మంజూరు చేసిన గురుకులాల్లోనూ మండలానికి అవకాశం దక్కలేదు. నిరుపేద విద్యార్థులు జైనథ్ మోడల్ స్కూల్‌లో అవకాశాలు లేకపోవడంతో, ఇంగ్లీషు మీడియం విద్యకు దూరమయ్యారు. ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్, జెడ్పీటీసీ అక్షిత సతీష్ పవార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్‌లు ప్రత్యేక చొరవతో మండలానికి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులం(బాలురు) మంజూరైంది. కానీ స్థానిక మండల కేంద్రంలో ప్రైవేటు, ప్రభుత్వ భవన సముదాయాలు అందుబాటులో లేకపోవడంతో జిల్లా కేంద్రానికి అనుసంధానంగా ఉన్న మావలలో గత విద్యా సంవత్సరం ప్రారంభించారు. వెంటనే 5, 6,7 తరగతుల నిర్వహణను సైతం గురుకులం సొసైటీ వారు చేపట్టారు. మండలానికి గురుకులం పాఠశాల మంజూరైన విషయం చాలా మందికి తెలియదు. ఈవిద్యా సంవత్సరంలో మరోతరగతి అప్‌గ్రేడ్ అయి 8వ తరగతి వరకు నిర్వహణ చేపట్టనున్నారు. ఒక్కొక్క తరగతిలో 80సీట్లు చొప్పున కేటాయించారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు, రాత పరీక్ష ద్వారా అడ్మిషన్ ప్రక్రియ చేపడుతున్నారు.

ముమ్మరంగా భవన నిర్మాణ పనులు..

మండల కేంద్రంలో గురుకులం నిర్వహణకు లీజ్‌కు తీసుకున్న రెండేకరాల ప్రైవేటు స్థలంలో, ప్రైవేటు యాజమాని పర్యవేక్షణలోనే ఆరు నెలల క్రితం భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తరగతి, నివాస గదులతో పాటు అన్ని హంగులతో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మొత్తంగా పనులు 70శాతం వరకు పూర్తయింది. ప్లాస్టరింగ్, విద్యుదీకరణ, ఇతర పనులు పూర్తి కావాల్సి ఉంది. మిగతా పనులన్నీ పూర్తయితే ఇక్కడే తరగతుల నిర్వహణ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఆగస్టు 15వరకు ఇక్కడ పాఠశాల నిర్వహణను ప్రారంభించడానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం



మండలానికి బీసీ గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక చొరవతో మంజూరైంది. పాఠశాల నిర్వహణకు అనుకులంగా భవన సముదాయాలు లేకపోవడంతో గత విద్యా సంవత్సరంలో మావలలో పాఠశాల నిర్వహణను ప్రారంభించాం. ఇక్కడ లీజ్‌కు తీసుకున్న చోట భవన నిర్మాణ పనులు ప్రస్తుతం ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

–ఠాక్రే వనిత గంభీర్, ఎంపీపీ

బీఆర్‌ఎస్‌దే మళ్లీ విజయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మళ్లీ విజయం సాధిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఆదివారం పల్లెపల్లెకూ ఎమ్మెల్యే రేఖానాయక్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దనోర(బి)లో పర్యటించారు. ముందుగా సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి వివరాలు, సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య, విద్యుత్ సమస్యలున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్ యేర్మ జాకేశ్వర్, కోవ రాజేశ్వర్, షేక్ సుఫీయన్, దేవ్‌పూజే మారుతి, ముండే బాబు, కదం మహేష్ పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్‌రూరల్: దళితుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఆదివారం స్థానిక ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ అసోసియేషన్ ఉట్నూర్ నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ మహానుభావుల జయంతి, పండుగలను కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి ఆశన్న, అధికార ప్రతినిధులు సుభాశ్, జాయింట్ సెక్రటరీ కొల్లూరి స్వామి అన్నారు. కార్యక్రమంలో కందుకూరి రమేశ్, ముకుంద్, బండి విజయ్, కొమ్ము బాపురావు, లక్ష్మిపతి, కాంతరావు, మిలింద్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దివ్యాంగులు

తాంసి: దివ్యాంగులకు పింఛన్ పెంపు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం మండలంలోని జామిడి గ్రామంలో ఎంపీటీసీ అశోక్‌తో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు నర్సింగ్, స్వామి, దత్తు, శ్రీహరి పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్ పెంచడంపై దివ్యాంగులు హర్షం వ్యక్తంచేస్తూ ఆదివారం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే రేఖానాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివ్యాంగులతో కాసేపు ముచ్చటించారు. రూ. 3116 పెన్షన్ రూ. 4116 పెంచడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితులకు కొంత సాయం అందించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

ఉట్నూర్‌రూరల్: గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, క్యాటరింగ్, స్వీపింగ్ బోధనేతర సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రేఖానాయక్ హామీ ఇచ్చారు. ఆదివారం ఉట్నూర్ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేకు గురుకుల విద్యాలయాల బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు చందు, కోల విఠల్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే జీతాలను చెల్లించాలని కోరారు. 12 నెలలతో కూడిన వేతనాలను ఇవ్వాలని, మహిళ ఉద్యోగులకు ఆరు నెలల జీతాలతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అశోక్, సుంగు, బాబులాల్, సుజాత, హేమంత్, రాజేందర్, సాదిక్, కేశవ్, గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య నిర్వహణ పనులు



బజార్‌హత్నూర్‌లో చేపట్టిన పారిశుధ్య పనులు

బజార్‌హత్నూర్: మండలంలోని 30 గ్రామ పంచాయతీల పరిధిలో 64 గ్రామాల్లో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. డ్రెయినేజీల్లో పూడిక తీత, పెంటకుప్పల తొలగింపు, చెత్త, పిచ్చిమొక్కల తొలగింపు పనులు గ్రామపంచాయతీ సిబ్బంది చేపడుతున్నారు. ఎంపీడీవో చౌహాన్ రాధ ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో గ్రామపంచాతీల్లో పారిశుధ్యం పనులు చేపట్టేందుకు అదనపు కూలీలను నియమించారు. పెంటకుప్పలు, పిచ్చిమొక్కలు తొలగించుటకు, డ్రెయినేజీల్లో పూడికతీతకు జేసీబీలను ఏర్పాటు చేశారు.

వాగులోని చెట్లు తొలగింపు..

మండల కేంద్రంలోని శివాజీ మార్కెట్‌కాలనీ సమీపంలో గల వాగులో గత కొన్ని సంవత్సరాల గ్రామ పంచాయతీ వారి నిర్లక్ష్యంతో భారీగా చెట్లు పెరిగాయి. దీంతో వరదనీటికి ఆటంకం ఏర్పడింది. గత వర్షాకాలం వరద నీరు కాలనీల్లోకి చేరింది. జేసీబీతో వాగులోని చెట్లను పక్కకు తొలగించి వరద నీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టారు.

పూడిక తొలగించారు

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో వాగులో పూడిక ఉండడంతో వర్షాకాలం ఇబ్బంది పడుతున్నాం. గ్రామ పంచాయతీ సిబ్బంది జేసీబీతో పూడికను తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఈఏడాది ఎంత వర్షం కురిసిన వరద నీరు ఇళ్లలోకి రాదు.

– బత్తిని సాయికుమార్, బజార్‌హత్నూర్

పనులు కొనసాగుతున్నాయి

అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నాం. డ్రెయినేజీలు శుభ్రం చేయించాం. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇళ్ల పరిసరాలలో పిచ్చిమొక్కలు తొలగించాం. రోడ్లపై గుంతలను పూడుస్తున్నాం. పెంటకుప్పలను తొలగించాం.

– చౌహాన్ రాధ, ఎంపీడీవో, బజార్‌హత్నూర్

పాడిపంటలు సమృద్ధిగా పండాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



కలశాన్ని ఎత్తుకున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్: జిల్లాలో వర్షాలు సకాలంలో కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తాటిగూడా కాలనీలో ఏర్పాటు చేసిన గంగనీళ్ల జాతరలో పాల్గొన్నారు. మహిళలతో కలిసి కలశాన్ని ఎత్తుకొని శివలింగానికి గంగాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయం వర్షాధారమని, వర్షాలు సమృద్ధిగా కురవాలని పల్లెలు, పట్టణాలలో కప్పతల్లి ఆటలు, భీమన్న పూజలు, గంగనీళ్ల నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. గంగపుత్ర సంఘ భవన నిర్మాణానికి రూ. 5 లక్షలతో స్థలాన్ని కేటాయించామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, కౌన్సిలర్ అశోక్ స్వామి, కోఆప్షన్ మెంబర్ సంజయ్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాలకు సముచిత గౌరవం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం హైందవ ధర్మాన్ని పరిరక్షిస్తూనే ఇతర మతాలను గౌరవిస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బృందావన్ కాలనీ సమీపంలో ఆదివా రం భీమన్న దేవునికి ప్రత్యేక పూజలు చేశారు. భీమ న్న దేవుడికి పూజలు చేస్తూ పంట పొలాల్లో విత్తనా లు నాటి వ్యవసాయ పనులు ప్రారంభించే వాళ్లమన్నారు. కార్యక్రమంలో దయాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.